COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE
H.No.27-30-3, CPI(M) State Committee Office,
Akulavari street, Governorpet,
Vijayawada - 520002.
Ph.No: 0866 - 2577202, Fax - 0866- 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం:

**తేది : 06.10.2015**
**విజయవాడ**

# పట్టణ ప్రజలపై గ్రీన్ సెస్ వసూలు ప్రతిపాదన విరమించుకోవాలి

**- సిపిఐ(యం)**

రాష్ట్రంలోని పట్టణ ప్రజలపై గ్రీన్ సెస్ ( పచ్చదనపు పన్ను) పేరుతో మరోపన్ను విధించే ప్రతిపాదనను విరమించుకోవాలని సి.పి.ఐ(యం) రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నది. గ్రీన్ సెస్ విధించే అవకాశాలను అధ్యయనం చేసి రిపోర్టు ఇవ్వటానికి రాష్ట్ర ప్రభుత్వం ఐదుగురితో ఒక కమిటీని నియమిస్తూ జీవో విడుదల చేసింది. రాష్ట్రంలో పట్టణ, స్థానిక సంస్థలు నిర్వహించే ప్రతి పనికి అయ్యే ఖర్చును ఆస్థి పన్ను నుండి ఖర్చుచేయాలి. అందుకు భిన్నంగా రాష్ట్రంలో ముందుగా పనులను విడదీసి, ప్రతిపనికీ విడివిడిగా ఆదాయ వ్యయాలను లెక్కగట్టే విధానాన్ని తీసుకు వచ్చారు. దానిలో భాగంగానే ముందుగా శానిటేషన్ కోసం యూజర్ చార్జీల పేరుతో చెత్తపన్ను విధించారు. పట్టణాలలో అనేక కాలనీలలో శానిటేషన్ బాధ్యతను షేరింగ్ పద్ధతిపై కాలనీ అసోసియేషన్ల మీదకు నెట్టారు. కొన్ని చోట్ల నీటి చార్జీలను భారీగా పెంచారు. ఇంకా కొన్ని మున్సిపాలిటీలలో నీటి చార్జీలను పెంచటానికి రంగం సిద్ధం చేస్తున్నారు. నీటి చార్జీలను ఇంటిపన్నుకు అనుసంధానం చేయంటంద్వారా ఇంక్రిమెంటల్ విధానాన్ని (పెంచాలన్న నిర్ణయాలను మరల మరల చేసే అవసరంలేకుండా ఆటోమాటిక్‌గా పెరిగే విధానం) ప్రవేశపెట్టారు. చివరకు బిల్లులు తయారు చేయటానికి, బిల్లులు వసూలు చేసుకోవటానికి కూడా సర్వీస్ చార్జీలపేరుతో వసూలు చేస్తున్నారు. ఆరోగ్యంకోసం వాకింగ్ చేసేవారిమీద కూడా పన్నులు వేస్తున్నారు. కళ్యాణమంటపాలలో పెండ్లిళ్ళు చేసుకునేవారిమీద కూడా యూజర్ చార్జీలను వసూలు చేస్తున్నారు.

ఇలా ప్రతిపనికీ పట్టణాలలో ఆదాయవ్యయాలను లెక్కగట్టి వసూలు చేసేవిధానం మొదలయింది. ఇది చాలదన్నట్టు ఇప్పుడు మున్సిపాలిటీ చేసే ప్రతి పనికీ ఒక రాష్ట్రవ్యాపిత కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలో పారిశుద్ధ్య విషయాలను పర్యవేక్షించటానికి స్వచ్ఛభారత్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. పచ్చదనం విషయాలను పర్యవేక్షించటానికి ఆంధ్రప్రదేశ్ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆంధ్ర ప్రదేశ్ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పట్టణ ప్రజలపై గ్రీన్ సెస్‌ను విధించబోతున్నారు. ఈ పన్నులు వసూలు చేయవలసిన బాధ్యత స్థానిక సంస్థలది. మారిన పరిస్థితుల్లో వాటికి నిధులు చేకూర్చవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది. అందుకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులు ఇవ్వకుండా నిలిపివేస్తూ, ఈ పనులకయ్యే ఖర్చును ప్రజలపై విధించటానికి పూనుకున్నది. రాష్ట్రంలో పచ్చదనాన్ని కాపాడటం రాష్ట్ర ప్రభుత్వబాధ్యత. దీని ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరించాలితప్ప, పట్టణ ప్రజలపై విధించటం దారుణం. కనుక పట్టణ ప్రజలపై గ్రీన్ సెస్ విధించే ప్రతిపాదనను విరమించుకోవాలని సి.పి.ఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండు చేస్తున్నది.

ఎంటర్‌టైన్‌మెంట్ ట్యాక్సు, రోడ్డు ట్యాక్సు లాంటి అనేక పన్నులు గతంలో పూర్తిగా స్థానిక మున్సిపాలిటీలు - కార్పొరేషన్‌లకే చెందేది. ఇలాంటి పన్నులన్నింటినీ క్రమంగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి తీసుకుని స్థానిక సంస్థల ఆదాయాలకు గండి కొట్టారు. ఇప్పుడు ప్రతి సేవకు విడివిడిగా పన్నులు ఆటోయేటిక్‌గా గల్లాపెట్టెలో పడే విధానాన్ని ప్రవేశ పెట్టారు.ప్రజల మీద ఇవి విపరీతమైన భారాలకు దారి తీస్తాయి. అందుకే విడి విడిగా భారాలు మోపే విధానానికి స్వస్థి చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి